మృత్యువులోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



రాజేష్, ప్రతాప్ (పాతచిత్రాలు)

అనకాపల్లి పట్టణం, కశింకోట, నక్కపల్లి, న్యూస్‌టుడే: కశింకోట జాతీయ రహదారి వద్ద మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి కశింకోట సీఐ స్వామినాయుడు కథనం ప్రకారం.. నక్కపల్లి మండలం నెల్లిపూడికి చెందిన బర్నికుల రాజేష్ (24), ఇదే మండలం గునుపూడికి చెందిన కురుందాస్ ప్రతాప్ (26) స్నేహితులు. ప్రైవేటు వాహనాల్లో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం వీరు విశాఖపట్నం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కశింకోట వద్ద తెల్లవారుజాము సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయమవడంతో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. గునుపూడికి చెందిన ప్రతాప్ తండ్రి మహాలక్ష్మి 15 ఏళ్ల క్రితమే మృతిచెందారు. తల్లి రూపతో కలిసి ప్రతాప్ ఉంటున్నాడు. ఇతడి అక్కకు వివాహమైంది. వివాహం చేద్దామని సంబంధాలు చూస్తున్న సమయంలో కొడుకు కానరాకుండా పోయాడంటూ ఇతని తల్లి రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

నెల్లిపూడికి చెందిన కన్నయ్య, లక్ష్మిలకు రాజేష్ ఒక్కగానొక్క కుమారుడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. కుమారుడిని రోడ్డు ప్రమాదం బలితీసుకోవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

యోగా పోటీల్లో కానిస్టేబుల్‌కు కాంస్య పతకం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో అచ్యుతాపురం పోలీసు కానిస్టేబుల్ ముడిల నిర్మల కాంస్య పతకం పొందారు. సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో నిర్వహించిన పోటీల్లో నిర్మల ప్రతిభ కనబరిచి పతకం పొందారు. ఈమె బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించి, మరిన్ని పోటీల్లో పాల్గొని మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



పతకం సాధించిన కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రతి శుక్రవారం.. రిజిస్ట్రేషన్ నేస్తం

కక్షిదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

ఈనాడు, అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో చర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం 'రిజిస్ట్రేషన్ నేస్తం' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. భూముల రీసర్వే జరిగిన తర్వాత చాలా గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వే నంబర్లు కనిపించడం లేదని, మార్కెట్ విలువల్లో తేడాలుంటున్నాయని, తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారని హక్కుదారులు ఆరోపిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇబ్బందులు పెడుతున్నారని, కుటుంబ సభ్యుల మధ్య ఆస్తులపై హక్కుల విషయంలో వివాదాలు ఏర్పడడం వంటి సమస్యలతో తరచూ జిల్లా కలెక్టరేట్‌కు కక్షిదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. అక్కడి నుంచి మరలా సంబంధిత శాఖకే వాటిని తిరిగి పంపించి పరిష్కరించాలని సూచిస్తున్నారు.



మన్మథరావు, జిల్లా రిజిస్ట్రార్

రిజిస్ట్రేషన్ సమస్యల కోసం కలెక్టరేట్ వరకు వెళ్లనవసరం లేకుండా కక్షిదారులు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయొచ్చని జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు చెబుతున్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. దీనివల్ల కక్షిదారుల సమస్యల పరిష్కారంలో కాలయాపన తగ్గుతుందని, సత్వర పరిష్కారం లభిస్తుందంటున్నారు. ఈ నెల 18 నుంచే రిజిస్ట్రేషన్ నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ సమస్యలపై కార్యాలయానికి రాలేనివారు 70939 21385 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసినా వాటికి పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జన్మభూమి స్ఫూర్తి కొనసాగించాలని కోరా!

- ★ అమెరికా పర్యటనలో ప్రవాసుల ఆదరణ అపూర్వం
- ★ వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధం
- ★ 'ఈనాడు'తో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

పుట్టిన ఊరు, ప్రాంతం అభివృద్ధి కోసం గతంలో మాదిరిగానే జన్మభూమి స్ఫూరిని కొనసాగించాలని ప్రవాసాంధ్రులను కోరినట్లు శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పారు.





గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం 50వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా అమెరికా వెళ్లారు. వాషింగ్టన్ డీసీ, లీస్‌బర్గ్ అట్లాంటా, డాలస్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో పర్యటించారు. ఇటీవలే సొంత నియోజకవర్గానికి చేరుకుని పల్లెపండగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తన అమెరికా పర్యటన, అక్కడి తెలుగువారు చూపిన ఆదరణ, వారి ఆకాంక్షల గురించి 'ఈనాడు'కు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి..

ప్రవాసాంధ్రుల్లో చాలామంది మన రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి వందల మందికి ఉపాధి కల్పించేందుకు సుముఖంగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడితే సహకరిస్తారా అని అడిగారు. ఇక్కడ కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో రాయితీలు ఇస్తున్న విషయం వారికి వివరించా. ఎన్నారైలు స్థాపించబోయే పరిశ్రమలకు అవసరమైన భూమి, ఇతర రాయితీలను త్వరితంగా అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఔత్సాహికులకు తెలియజేశా.

అమెరికాలో నివసిస్తున్న తెలుగువారు రాష్ట్రానికి వచ్చినప్పుడు భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే అవకాశం కల్పించమని అడిగారు. ప్రస్తుతం భార్య, భర్తకు మాత్రమే ఈ సదుపాయం అమల్లో ఉంది. కుటుంబంతో దర్శించుకోవాలన్న వారి ఆకాంక్ష సముచితం. నాతో పాటు ఎన్నారై సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వచ్చారు. మేమిద్దరం ప్రవాసాంధ్రుల ఆశలు, కోర్కెలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటిని నెరవేర్చాలని కోరతాం.

సేవా కార్యక్రమాలు చేపట్టాలని..

అమెరికాలో పర్యటించినప్పుడు వేలాది మంది ప్రవాసాంధ్రులను కలిశాను. వారిలో ఓ కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని వారు విశ్వసిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం కోసం గతంలో జన్మభూమి పేరుతో కార్యక్రమాలు చేపట్టగా ఎంతోమంది ఎన్నారైలు ముందుకొచ్చారు. ఇప్పుడు కూడా అదే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడానికి సహకరించాలని కోరాను. అమెరికాలో లక్షమందికి పైగా తెలుగువారున్నారు. వారంతా తమతమ ఊళ్లలో పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఉదారంగా సాయం చేస్తుండాలి. ఇలా చేస్తే తక్కువ కాలంలోనే ఎక్కువ అభివృద్ధి చూపడానికి అవకాశం ఉంటుందని గుర్తుచేశాను. నా ప్రతిపాదనకు వారంతా సానుకూలంగా స్పందించారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పడం చాలా సంతోషం అనిపించింది.

అప్పుడు కోడెల.. ఇప్పుడే నేను..

'అమెరికా పర్యటన ఎంతో సంతృప్తినిచ్చింది. తెలుగువారు బాగా ఆదరించారు. వారి ఇళ్లకు వెళ్లి ఒకట్రెండు రోజులు అక్కడే గడిపాం. నాలుగైదు రాష్ట్రాల్లో వేలాది మంది ప్రవాసాంధ్రులతో అయిదారు సమావేశాలు నిర్వహించారు. తెలుగు సాంస్కృతిక సంఘం 40వ వార్షికోత్సవానికి అప్పట్లో స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావు ముఖ్య అతిథిగా వెళ్లారు.. రజతోత్సవానికి నేనూ స్పీకర్‌గా పాల్గొనడం ఆనందం కలిగించింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో రాక్షస పాలన చూసిన ఎన్నారైలు ఎలాగైనా ఇక్కడి పాలన మారాలని, మళ్లీ చంద్రబాబు రావాలని ఎంతగానో తపించారు. రూ. లక్షలు ఖర్చు పెట్టుకుని సొంతూళ్లకు వచ్చి ఓటేసి వెళ్లారు. అమెరికాలో ఉంటూనే ఇక్కడి ఓటర్లను చైతన్యం చేశారు. వారు అందించిన సహకారాన్ని మర్చిపోలేం. రాష్ట్రంలో వారికి తగిన గౌరవాన్ని అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామ'ని సభాపతి వివరించారు.



అమెరికాలో అయ్యన్న దంపతులకు పురస్కారం


రీసర్వే తప్పులు సరిదిద్దేలా..

> వైఎస్ఆర్ జగనన్న భూరక్ష రైతులకు అదనపు తలనొప్పులు తీసుకొచ్చింది. గతంలో ఉండే కొలతలకు, రీసర్వేకు తేడాలు, యాజమాని పేర్ల మార్పు, సరిహద్దుల్లో లోపాలు చోటుచేసుకున్నాయి.

జగన్ సర్కార్ అస్తవ్యస్త విధానాలతో ఆదరాబాదరాగా నిర్వహించిన సమగ్ర భూసర్వేలో లోపాలను సరిచేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గ్రామసభలను నిర్వహించి ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడానికి చర్యలు తీసుకుంది.



అత్యాధునిక రోవర్ సర్వేలోనూ పొరపాట్లు



అచ్యుతాపురం, నర్సీపట్నం, న్యూస్‌టుడే

రీసర్వే వల్ల రైతులు పడిన ఇబ్బందులను తెలుసుకున్న కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 17 నుంచి నెలరోజుల పాటు గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూశాఖను ఆదేశించింది. రైతుల నుంచి అర్జీలను స్వీకరించి 100 శాతం వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. సర్వే కాని గ్రామాల్లో దీనిని కొనసాగించాలని ఆదేశించింది. గతంలో మాదిరిగా మమ అనిపించకుండా ఒక్కో గ్రామానికి నాలుగు నెలలు సమయం కేటాయించారు. తూతూ మంత్రంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని ఉద్యోగులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది.

జగన్ చిత్రాల తొలగింపు చర్యలు

జగన్ చిత్రాలతో పట్టా పాసుపుస్తకాలను ముద్రించి రైతులకు అందించారు. ఈ చిత్రాలపై పెద్దఎత్తున విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. పొలాల్లో వేసిన సర్వేరాళ్లపైనా జగన్ చిత్రం ముద్రించి, పేర్లను రాయించారు. పాసు పుస్తకాలపై జగన్ చిత్రం ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో రుణాలు ఇవ్వడానికి రైతులకు బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు నిరాకరించాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని సర్వే రాళ్లపై చిత్రాలు, పేర్లను తొలగించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. జగన్ చిత్రంతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేసి అధికార చిహ్నంతో కొత్తగా పాసు పుస్తకాలు అందిస్తామని ప్రకటించింది. పొలాల్లో ఇష్టానుసారంగా వేసిన సర్వేరాళ్ల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి వాటిని తొలగించాలని నిర్ణయించింది.

17 నుంచి నెలరోజుల పాటు గ్రామసభలు



పొలాల్లో సర్వే రాళ్లు వేస్తున్న కూలీలు

జగనన్న భూముల రీసర్వే అంతా గందరగోళంగా మారడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. అత్యాధునిక యంత్రాలు, డ్రోన్లతో చేపట్టినా ఇందులోనూ పొరపాట్లు తప్పలేదు. ముఖ్యంగా తగినంత సమయం కేటాయించకుండా లక్ష్యాలతో ఒత్తిడి పెంచడంతో చాలామంది సర్వే ఉద్యోగులు అదరాబాదరాగా దీనిని ముగించేశారు. దీనివల్ల భూముల కొలతల సమాచారంలో తప్పులు కొక్కొల్లలుగా చోటు చేసుకున్నాయి. సందట్లో సడేమియాలా వైకాపా నాయకులు కొందరు సర్వే అధికారులను లోబర్చుకొన్నారు. వీరు పేద రైతుల భూముల్లో కొంతభాగం తమ పేరిట నమోదయ్యేలా కుట్రలు పన్నారంటున్నారు. ఈ అవకతవకలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి సర్కారు గ్రామ సభల ద్వారా వీటిని పరిష్కరించేందుకు నిర్ణయించింది.



రోజంతా సమస్యలపై అధ్యయనం: గతంలో రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకోవడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది రోజంతా ఉండి సమస్యలను అధ్యయనం చేసి సరి చేయడానికి కృషిచేస్తారు. సమస్యలతో ఇబ్బంది పడే రైతులు, భూమి యాజమానులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా దీనిని సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై గ్రామాల్లో ప్రచారం చేయాలి. ఫిర్యాదు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇచ్చి భూమిని ఎప్పుడు పరిశీలిస్తామనేది తేదీతో సహా సమాచారం అందిస్తాం.

– బి.దయానిధి, డీఆర్వో



సర్వే నిర్వహిస్తున్న అధికారులు (పాతచిత్రం)

208 గ్రామాల్లో సభలు: నర్సీపట్నం డివిజన్లో మొత్తం 208 గ్రామాల్లో సభలు నిర్వహించేందుకు కార్యక్రమాన్ని రూపొందించారు. గతంలో 12 మండలాల్లో మొత్తం 357 ఊర్లలో జగనన్న రీసర్వే చేపట్టాలని ప్రతిపాదించారు. 208 పల్లెల్లో సర్వే పూర్తయినట్లు నోటిఫికేషన్ జారీ చేసి సరిహద్దు రాళ్లు పాతారు. ఈ గ్రామాల్లోనే ఇప్పుడు సభలు చేపట్టి రైతులకు ఎదురైన ఇబ్బందులన్నీ తెలుసుకొని వాటిపై విచారణ చేపట్టనున్నారు. సరిహద్దు రాళ్లపై ఉన్న జగనన్న పేరును తొలగించనున్నారు. డివిజన్లో 208 గ్రామాల్లో మొత్తం 2,09,417 రాళ్లు ఉన్నాయని తేల్చారు. ఈ పనులను ప్రత్యేకంగా గుత్తేదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కటింగ్ యంత్రంతో వీటిని చేరిపేసేలా ఏర్పాట్లు చేస్తారు.

సభలకు పక్కా ఏర్పాట్లు: రెవెన్యూ సభలకు పక్కా ఏర్పాట్లు చేపట్టాం. గురువారం నుంచి నెల రోజులపాటు వీటిని నిర్వహించనున్నాం. ఇందుకు మండలాల వారీగా షెడ్యూల్ రూపొందించాం. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులంతా సభల్లో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారు. నష్టపోయిన రైతుల పొలాలను క్షేత్రస్థాయి పరిశీలించి పొరపాట్లు, ఆక్రమణలు ఇతరత్రా అన్నింటిని గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. 70 రోజుల్లో సమస్యలు పరిష్కరించనున్నాం.



-ఎమ్మార్వీ బాబు, డివిజన్ సర్వే విభాగం పరిశీలకులు

ఇంటి దొంగల గుట్టురట్టు.. నలుగురి అరెస్టు



రూ. 1.15 కోట్ల విలువైన పల్లాడియం పొడి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కార్బన్ ఉత్ప్రేరకాన్ని తయారు చేయడానికి ఫార్మా కంపెనీలో వాడే ఖరీదైన పల్లాడియం లోహం పొడి చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కంపెనీలో పనిచేస్తున్న వారే చోరీకి పాల్పడినట్లు గుర్తించి నలుగురిని అరెస్ట్ చేసి వీరి నుంచి రూ. 1.15 కోట్ల విలువైన ఈ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఎం.దీపిక బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలు వెల్లడించారు. పరవాడలోని రవీంద్ర హిరేయస్ కంపెనీలో ఈ నెల 9న పల్లాడియం లోహానికి చెందిన పౌడర్ మాయమైంది. ఖరీదైన దీనిని ఫార్మా కంపెనీలో వినియోగిస్తారు. దీనిని డ్రయ్యర్‌లో ఉంచి ఆరబెడతారు. ప్రొడక్షన్ బ్లాక్‌లో ఉన్న డ్రయ్యర్‌ను రాత్రి వేళలో ఆరబెట్టడం కోసం 4.2 కేజీల పౌడర్‌ను 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్లాంట్‌లో ఉంచి తాళం వేశారు. మర్నాడు చూడగా చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై ఈ నెల 12న కంపెనీ ప్రతినిధి వరదరాజన్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేయగా కంపెనీలో పనిచేస్తున్న వారే రాత్రి వేళ గోడదూకి లోపలికి వెళ్లి మారుతాళంతో తలుపు తెరిచి చోరీ చేసినట్లు తేలింది. చోరీకి పాల్పడ్డ చింతకాయల రాజు, ముద్దనూరు వినీత్ వర్మ, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజులను ఈ నెల 15న తానాం శ్మశానవాటిక వద్ద అరెస్ట్ చేశారు. దొంగిలించిన పౌడర్‌ను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీసీఎస్ ఎస్సై రమేశ్, పరవాడ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న పల్లాడియం లోహం

పొట్టేల్ చిత్ర బృందం సందడి

ఈ నెల 25న విడుదలయ్యే పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆ సినిమా హీరోయిన్ అనన్య నాగళ్ల తెలిపారు. చిత్ర యూనిట్ హైదరాబాద్ నుంచి బస్సుయాత్ర చేస్తూ బుధవారం బీచ్‌రోడ్డుకు వచ్చింది. హీరో యవన్‌కృష్ణ, నటులు అజయ్‌పాత్ర, నోయల్, దర్శకుడు సాహిత్ మొతుకూరి తదితరులు సందడి చేశారు. –పెదవాల్తేరు, న్యూస్‌టుడే





కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

అభిజీత్ లేఆఫ్ చట్టవిరుద్ధం: సీఐటీయూ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌లో అభిజీత్ పరిశ్రమ విధించిన లేఆఫ్ చట్ట విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మండిపడ్డారు. బుధవారం పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనకు ఆయన సంఘీభావం ప్రకటించారు. కార్మికులను మోసగించడానికే యాజమాన్యం అక్రమంగా లే ఆఫ్ ప్రకటించిందన్నారు. జీతాలు ఇవ్వకుండా ఉండాలనే లక్ష్యంతో దీనిని తెరమీదకు తీసుకొచ్చారన్నారు. భూములు ఇచ్చిన నిర్వాసితులను సైతం రోడ్డుమీదకు లాగారన్నారు. ఇన్నాళ్లు తక్కువ జీతాలతో వెట్టిచాకిరి చేయించుకుని, ఇప్పుడు ఏకంగా ఉపాధి లేకుండా చేశారన్నారు. సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, బుద్ధ రంగారావు, కర్రి అప్పారావు, శివాజీ, రమణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక... ఎదురు చూపులేనా ఇంకా!

-నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి డిపో ఖాళీ

ఇసుక కోసం జిల్లాలో జనం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో నిల్వ ఉంచిన ఇసుక విక్రయాలు చేపట్టగా, నక్కపల్లి డిపోలో వేల టన్నులు విక్రయించారు. ప్రస్తుతం సరకు లేకపోవడంతో ఆయా వర్గాలు ఎదురు చూపులు చూస్తున్నారు.

ఉచిత విధానం ప్రకటించిన ప్రభుత్వం ఉన్న ఇసుకను అమ్ముకోవడానికి అనుమతించింది. వివాదాల కారణంగా నర్సీపట్నం మండలం గబ్బాడ వద్ద ఉన్న డిపోలో విక్రయాలు మొదలు కాలేదు. దీంతో నక్కపల్లి యార్డులో ఉన్న సుమారు 24 వేల టన్నుల నిల్వల విక్రయాలు చేపట్టారు. ఇది మొత్తం రాజమహేంద్రవరం నుంచి రావడంతో రవాణా ఛార్జీలతో కలిపి టన్ను రూ.1225 చొప్పున విక్రయించారు. చివర్లో దీని ధర రూ.1165లకు తగ్గింది. జిల్లా వ్యాప్తంగా అవసరాలు ఉన్నవారంతా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దీన్నే తీసుకెళ్లారు. ఈ మొత్తం గత నెలాఖరుకు పూర్తిగా విక్రయించారు. మరోవైపు అందుబాటులో ఉన్న నదులు, కాలువల నుంచి సొంత అవసరాలకు నాటుబళ్లపై ఉచితంగా తీసుకెళ్లొచ్చుననే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. దీన్ని అలుసుగా తీసుకుని కొందరు విక్రయాలు చేస్తుండటంతో వరహా నుంచి తరలించకుండా అడ్డుకట్ట వేశారు.



ఇసుక లేకపోవడంతో యార్డులో అడ్డుగా పెట్టిన యంత్రం

తవ్వకాలకు అనుమతులు లేవు

» నక్కపల్లిలో సరకు నిండుకుని దాదాపు మూడు వారాలు కావొచ్చింది. తాజాగా ప్రభుత్వం నదుల్లో ఇసుక తవ్వకాలకు బుధవారం నుంచి అనుమతులు ఇచ్చింది. ఇందులో జిల్లాకు సంబంధించిన నదులేవీ లేవు. దీంతో నక్కపల్లి డిపోకు పై ప్రాంతాల నుంచే ఇసుక రావల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఇసుక అవసరాలు పెరగడం, సరకు ఎక్కడా లభ్యత లేకపోవడంతో నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొన్నిచోట్ల ట్రాక్టరు, లారీల యజమానులు దొడ్డిదారిన ఏటిలో, సముద్ర తీరాల్లోని ఇసుకను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో తాండవ, వరహా, శారద తదితర నదులున్నాయి. వీటినుంచి సరకు అందుబాటులోకి తేగలిగితే ధర తగ్గడంతో పాటు, నిర్మాణదారుల ఇబ్బందులు తీరతాయి.

▸▸ **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో అందుబాటులో:** ఇసుకకు సంబంధించి ప్రస్తుతం కొన్నిరీచ్‌లలో ఇసుకను అందుబాటులోకి తెచ్చారు. దీన్ని ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్‌లోనూ ఇస్తున్నారు. అవసరమైన వారు తమ వివరాలను అందించి బుక్ చేసుకోవచ్చు. స్థానిక నదుల్లో రీచ్‌లకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి నక్కపల్లి డిపోకు సరకు రాదు. రానున్న వర్షాకాలానికి మాత్రమే ఆయా సమయంలో అందుబాటులో ఉంచుతారు. –ఎం.శ్రీనివాసు, ఏడీ మైన్స్

ధన్వంతరీయ వనం అభివృద్ధి చేయాలి: అయ్యన్న



డీఎఫ్‌వో శామ్యూల్‌కు సూచనలు ఇస్తున్న శాసనసభాపతి అయ్యన్న, పక్కన విజయ్, తదితరులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నానికి సమీపంలోని యర్రవరం అటవీ ప్రాంతంలో దాదాపు 25 హెక్టార్లలో రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల పెంపక క్షేత్రాన్ని (ధన్వంతరీయ వనం) అభివృద్ధి చేయాలని డీఎఫ్‌వో బి. శామ్యూల్‌కు శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. అయ్యన్నను డీఎఫ్‌వో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాను అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ధన్వంతరీయ వనాన్ని ఏర్పాటు చేయించానని తెలిపారు. అరుదైన ఔషధ మొక్కలన్నీ సేకరించి ఇక్కడ పెంచేవారని, రాష్ట్రంలోనే ఇది నమూనాగా ఉండేదని వివరించారు. ఇది పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నర్సీపట్నం ప్రాంతంలో రైతులు ఎక్కువగా సరుగుడు మొక్కలు కోరుతున్నందున సామాజిక అటవీ విభాగం ద్వారా నర్సరీల్లో భారీగా వీటిని పెంచాలని అయ్యన్న సూచించారు.

దారిమళ్లిన ఆదాయమెంత?

అనకాపల్లి, న్యూస్‌టుడే

రైతుల సేవల కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ కమిటీలు గత ప్రభుత్వ హయాంలో గాడితప్పాయి. మార్కెట్ యార్డుల ఆదాయాన్ని దారి మళ్లించినట్లు తెలుస్తోంది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇవన్నీ రద్దు చేశారు. కొన్ని యార్డుల పరిధిలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత కమిటీలను రద్దు చేయడంతో పాటు కమిటీల పరిధిలోని ఆదాయ, వ్యయాల లెక్క తేలేందుకు జిల్లా స్థాయిలో విజిలెన్సు కమిటీని ఏర్పాటు చేసింది.

కమిటీ సభ్యులు వీరే

మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రవికిరణ్ నేతృత్వంలో ఎలమంచిలి, పాయకరావుపేట, చోడవరం మార్కెట్ కమిటీ కార్యదర్శులు బి.చక్రపాణి, ఆర్.నాగకుమార్, బంగ్రారాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ యూడీసీ గణపతిలను కమిటీ సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఈ కమిటీ రంగంలో దిగి లోపాలను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

ధాన్యంపై రెండు శాతం, మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులకు ఒక శాతం మార్కెట్ సెస్‌గా వసూలు చేస్తారు. జిల్లాలో చెరకు, వరి సాగుతో పాటు సరుగుడు ఎక్కువగానే పండిస్తారు. కొంతమంది వ్యాపారులు సిబ్బందిని మంచి చేసుకొని సెస్ ఎగవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెక్ పోస్టుల వద్ద కొందరి చేతివాటంతో ఆదాయం దారి మళ్లుతోందనే వినిపిస్తున్నాయి. వ్యాపారులు పూర్తి స్థాయిలో సెస్ చెల్లిస్తున్నారా, బకాయిలు ఏమైనా ఉన్నాయా, చెక్ పోస్టులు కళ్లు కప్పి వేరే దారుల్లో సరుకు తరలిస్తున్నారా, సిబ్బంది చేతివాటం ఏమైనా ఉందా అంశాలను బృందం సభ్యులు పరిశీలిస్తారు. మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టుల్లో దస్త్రాలను తనిఖీలు చేస్తారు.



జిల్లా మార్కెటింగ్‌శాఖ కార్యాలయం

నెలాఖరుకు నివేదిక



ఇప్పటికే తనిఖీలు ప్రారంభించాం. అనకాపల్లిలో రూ.లక్ష, పాయకరావుపేటలో రూ.67 వేలు మొండి బకాయిలను వ్యాపారుల నుంచి వసూలు చేశాం. ఈనెలాఖరుకు తనిఖీలు పూర్తి చేసి ప్రభుత్వానికి తొలి నివేదిక ఇస్తాం.

– రవికిరణ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి

ఉత్కంఠభరితంగా కబడ్డీ పోటీలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్ గేమ్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో బుధవారం వేములపూడి హైస్కూల్ ఆవరణలో ఉమ్మడి విశాఖజిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో గాజువాక నియోజకవర్గ జట్టు ప్రథమ, నర్సీపట్నం నియోజకవర్గ జట్టు ద్వితీయ స్థానాలు, బాలికల విభాగంలో అరకులోయ నియోజకవర్గ జట్టు ప్రథమ, చోడవరం నియోజకవర్గ జట్టు ద్వితీయస్థానాల్లో నిలిచాయి. జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఎంఈఓ చీడిపల్లి తలుపులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వ్యాయామోపాధ్యాయులు డి.రవి, పి.సుమన్ పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయుడు జి.రమణ, స్కూల్ కమిటీ అధ్యక్షుడు జి.వేమాలతల్లిపాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్న బాలికలు



బాలుర జట్టు ఇదే..

ఖోఖో జూనియర్ జిల్లా జట్ల ఎంపిక 19న

నెహ్రూచౌక్ (అనకాపల్లి): విశాఖ జిల్లా ఖోఖో జూనియర్ జట్ల ఎంపిక తుమ్మపాల ఖోఖో మైదానంలో శనివారం జరగనున్నట్లు ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులు 21-11-2006 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు కాణిపాకంలో ఈ నెల 25, 26, 27వ తేదీల్లో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయికి 46 మంది క్రీడాకారుల ఎంపిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 46 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17 సెపక్ తక్రా, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చిన బాల, బాలికలను ఎంపిక కమిటీ ఎంపిక చేసినట్లు ఎంఈఓ పడాల దాసు పేర్కొన్నారు. ఈ పోటీలను సర్పంచి సబ్బవరపు పెంటమ్మ ప్రారంభించగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని 34 పాఠశాలల నుంచి 140 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-14, 17 ఫుట్‌బాల్ పోటీలకు బాలురు, బాలికల విభాగాల నుంచి 18 మంది చొప్పున ఎంపిక కాగా, సెపక్ తక్రాకు అండర్-14, 17 విభాలకు ఐదుగురు చొప్పున బాల, బాలికలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్ని ఎంఈఓ పడాల దాసుతో పాటు జిల్లా క్రీడా పరిశీలకుడు ఎం.ఎం.మనోహర్, వ్యాయామోపాధ్యాయులు బి.బాబూరావు తదితరులు అభినందించారు.



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలికలను అభినందిస్తున్న అధికారులు



సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన బాల, బాలికలతో ఎంఈఓ పడాల దాసు తదితరులు

వృత్తి నైపుణ్యంతో విద్యార్థుల రాణింపు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి వృత్తి నైపుణ్యం అవసరమని ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాను ప్రిన్సిపల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో రెండో ఉద్యోగ మేళా అన్నారు. గతంలో 94 మంది వరకు విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. స్కిల్ హబ్ సమన్వయకర్త అప్పలనాయుడు మాట్లాడుతూ యువతలో నైపుణ్యం ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. 125 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా వరుణ్ మోటార్స్‌కు 4, అపోలో ఫార్మసీ 20, హెల్త్ కేర్‌కు 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రితీష్, శ్రీనివాస్, నాగార్జున, కిషోర్, మాల్యాద్రి, పిచ్చమ్మ, రత్నకుమారి, సుధీర్, సూర్యవతి, సత్యవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్

ఆంగ్ల భాష వక్తృత్వ పోటీల్లో కింతలి విద్యార్థుల ప్రతిభ

మాడుగుల గ్రామీణం: వారాధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్లభాష రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మైచర్ల రమ్యశ్రీ, కోటారి లిఖిత, దండి ప్రత్యూష బృందం ప్రథమ బహుమతి సాధించిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్ కందా తెలిపారని ఉపాధ్యాయురాలు చంద్రకళ పేర్కొన్నారు. 'చిన్న కుటుంబాలు-వరమా? శాపమా?' అనే అంశంపై ఈ పోటీ జరిగిందన్నారు. పొందారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరగడం నరసింగరావు వీరిని అభినందించారు.



విజేతలతో ఉపాధ్యాయులు

గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించరా..!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జలవనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, రహదారులు, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని, ఇది వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్తగా గృహాలు మంజూరు కాలేదన్నారు. గ్రామసభల వివరాలను జడ్పీటీసీలకు తెలియజేయాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని కోరారు. జడ్పీ సీఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని జడ్పీటీసీ సభ్యులను కోరారు. నాలుగో స్థాయీ కమిటీ సమావేశానికి సభ్యులు జడ్పీటీసీలు గైర్హాజరయ్యారు. కోరం చాలకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై కలెక్టర్ ఆరా..

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణ పనులు నిర్ణీత కాలంలోగా పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గృహనిర్మాణ సంస్థ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా సబ్బవరం మండలంలోని గొల్లలపాలెం-2 లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి వాటి స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, నివేదికలు ఎప్పటికప్పుడు పంపించాలని సూచించారు. గృహనిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

కశింకోట, న్యూస్‌టుడే: హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన హజరత్ అబ్దుల్ అజీజ్ షా బాబా ఉరుసు మూడో రోజు బుధవారం వేడుకగా ముగిసింది. సాయంత్రం మహిళలు దర్గా ఆవరణలో దీపాలు వెలిగించారు. అనంతరం ఆరాధన నిర్వహించారు. మహిళలంతా భక్తిగీతాలను ఆలపించారు. మూడు రోజులు బాబా సమాధిని వేలాదిమంది హిందూ, ముస్లింలు దర్శించుకొని ప్రార్థనలు చేశారు. వీరికి దర్గా కమిటీ భోజన, వసతి సదుపాయాలను కల్పించింది. చందనోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ఖవ్వాలి [illegible]. మైసూరుకు చెందిన అజాం దిల్‌దార్, బెంగళూరుకు చెందిన రజియా పోటాపోటీగా ఆలపించిన భక్తిగీతాలు, గజల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దర్గా కమిటీ అధ్యక్షులు గురుప్రసాదరావు, సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాదరీ, సయ్యద్ జిలానీ, సయ్యద్‌జాఫర్ అలీ, అక్బర్ అలీ భక్తులకు ఏర్పాట్లు చేశారు. సీఐ అల్లు స్వామినాయుడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



దర్గా ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఖవ్వాలి గీతాలాపన చేస్తున్న మైసూరుకు చెందిన అజాం దిల్‌దార్

పడవలు నిలిపేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: సముద్రంలో వేటకు వెళ్లే బంగారమ్మపాలెం మత్స్యకారుల పడవలు నిలుపుకోవడానికి శాశ్వత పరిష్కారం చూపేవరకు నదిలో వేట కొనసాగిస్తామని మత్స్యకారులు అధికారులకు తేల్చిచెప్పారు. నావికా ప్రత్యామ్నాయ స్థావరం నిర్వాసితులైన బంగారమ్మపాలెం గ్రామస్థులతో బుధవారం ఆర్డీవో వీవీ రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్ మనోరమ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పడవలను నదిలో కాకుండా సముద్రం ఒడ్డున నిలుపుకోవాలని, ప్రహరీ నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు. దీనిపై మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. సముద్రం ఒడ్డున పడవలు నిలిచే పరిస్థితి లేదన్నారు. చినఉప్పలం, కాపులవాతాడ గ్రామాల మధ్యలో వరాహనది కాలువను అభివృద్ధిచేస్తే మత్స్యకారుల పడవలు నిలుపుకోవడానికి ఇబ్బందులు ఉండవని అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులు మారిన ప్రతిసారీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం చూపలేదని మత్స్యకారులు తెలిపారు. నిర్వాసితుల సమస్యలను కలెక్టర్‌కు దృష్టికి తీసుకువెళ్తామని ఆర్డీవో రమణ తెలిపారు. మత్స్యకారులంతా ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. సీఐ కుమారస్వామి, ఎస్సై విభీషణరావు, సర్పంచి మైలపల్లి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు పెర్ల మాధవ, మాజీ సర్పంచి కారె కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మైలపల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న మత్స్యకారులు

యువకుడి బలవన్మరణం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురై పట్టణంలోని రజక కాలనీకి చెందిన గుడివాడ రవికుమార్ (28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమామహేశ్వరరావు కథనం ప్రకారం రవికుమార్ చికెన్ దుకాణంలో పని చేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో కొంతకాలంగా భార్య ఇతనికి దూరంగా ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం మత్తులో ఇష్టానుసారం ప్రవర్తించడం స్థానికులు గమనించారు. బుధవారం ఉదయం ఇతని ఇంట్లో సమీపంలో చుట్టుపక్కల వారు తలుపు తెరిచి ఉండటం గమనించి లోపలకు వెళ్లి చూశారు. ఉరివేసుకుని కనిపించడంతో బంధువులకు సమాచారం అందించారు. తునిలో ఉన్న తల్లి సత్యవతికి కబురుచేశారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గాయపడిన మరో కార్మికుడి మృతి

ఎలమంచిలి/ గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు పంచాయతీ పరిధి మర్రిబంద వద్ద ఈ నెల 5న ఇటుకల పరిశ్రమ ఆవరణలో కార్మికులు నివాసం ఉన్న షెడ్డులో గ్యాస్ లీకైన ప్రమాదంలో మరో కార్మికుడు బుధవారం మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహాని గ్రామం శాంతినగర్‌కు చెందిన జి.కృష్ణారెడ్డి (40) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎలమంచిలి గ్రామీణ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ముగ్గురు కార్మికులూ గాయపడగా, ఇప్పటికే ఇద్దరు మృత్యువాత పడ్డారు. చికిత్స పొందుతున్న మిగిలిన కార్మికుడు కూడా చనిపోవడంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు.

మానసిక వికాసం పెంపొందేలా బోధించాలి

కశింకోట, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందేలా బోధన అందించాలని కలెక్టరు విజయకృష్ణన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. కశింకోట భవిత కేంద్రాన్ని బుధవారం కలెక్టరు తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపి సేవలు సక్రమంగా అందుతున్నాయా? అని ప్రశ్నించారు. అవసరమైన ఉపకరణాలు అందించాలన్నారు. పిల్లలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ వారి ఆలోచనలు, శక్తి సామర్థ్యాలు మెరుగుపడేలా తోడ్పడాలని ఆదేశించారు. పరవాడ ఎన్టీపీసీ అందిస్తున్న బోధనోపకరణ సామగ్రిని జిల్లాలో అన్ని భవిత కేంద్రాలకు త్వరలో అందించాలని జిల్లా సమగ్ర సహిత విద్య సమన్వయకర్త శకుంతలను ఆదేశించారు. ఆర్డీవో షేక్ ఆయిషా, విద్యాశాఖ సహాయ సంచాలకులు జి.రామజ్యోతి, ఎంఈవో వెంకట సురేష్ తదితరులు ఉన్నారు.



భవిత కేంద్రంలో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

లచ్చన్నపాలెంలో బాల్యవివాహం అడ్డగింత



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: యుక్త వయసుకు రాకుండా ఆడపిల్లలకు పెళ్లిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ మేరీసువార్త హెచ్చరించారు. లచ్చన్నపాలెంలో బుధవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. పదిహేడేళ్ల బాలికకు వివాహం చేసేందుకు పెద్దలు ప్రయత్నిస్తున్నారంటూ ఐసీడీఎస్ అధికారులకు అందింది. దీనిపై స్పందించిన సీడీపీఓ మేరీసువార్త పోలీసుల సహాయంతో వివాహాన్ని అడ్డుకున్నారు. బాలిక తల్లితండ్రులతో మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని వివరించారు. వివాహాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు.

సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్‌లో సాంకేతిక లోపం

పరవాడ: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 500 మెగావాట్ల సామర్థ్యంగల ఈ యూనిట్‌లోని బాయిలర్ ట్యూబులకు లీకేజీలు ఏర్పడడంతో సంస్థ అధికారులు ఉత్పత్తిని నిలుపుదల చేశారు. గురువారం సాయంత్రం నాటికి మరమ్మతులు పూర్తయ్యే అవకాశం ఉందని, 2, 3, 4 యూనిట్‌లలో విద్యుదుత్పత్తి యథావిధిగా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **మార్టిన్,** శ్రీ సత్య: **మా నాన్న,** సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం,** స్క్రీన్2: **శ్వేగ్** వెంకటేశ్వర: **జిగ్రా,** పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్,** షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎలమంచిలి గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఏటికొప్పాక, ములకలాపల్లి, కొత్తలి, పేరంటాలపాలెం గ్రామాల్లో గురువారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వేంపాడు, డీఎల్‌పురం, చిన దొడ్డిగల్లు, డొంకాడ, రేబాక, ముకుందరాజుపేట, నెల్లిపూడి గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా ఉండదని ఏఈ కృష్ణ తెలిపారు.

అభివృద్ధి పనులపై అవగాహన తప్పనిసరి

కోటవురట్ల, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎంపీడీఓ కాశీ విశ్వనాధరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రజా ప్రతినిధులకు రెండు రోజులు శిక్షణ తరగతులను నిర్వహించారు. మండలంలోని 25 పంచాయతీల్లో ఉన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు. తొలిరోజు బాపిరాజు కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి రఘు, గ్రామాలకు వచ్చే నిధులు, వాటి వినియోగం, చేపట్టనున్న అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్.రాయవరంలో ఎంపీడీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

మెగా ప్రాజెక్టుకు రహదారి గండం

రూ.60 కోట్లున్నా సాగని పైపులైను పనులు

మెగా తాగునీటి ప్రాజెక్టు పనులకు జాతీయ రహదారి అడ్డంకిగా మారింది. నిధులున్నా, హైవే అధికారుల తీరుతో పైపులైను పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మూడు మండలాల్లోని గ్రామాలకు తాగు నీరు అందడం లేదు.


జాతీయ రహదారి పక్కన పైపులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని 140 గ్రామాలకు రక్షిత జలాలు అందించాలనే ఉద్దేశంతో 2012లో మెగా ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. నాతవరం మండలంలోని శరభవరంలో ఏలేరు కాలువ జలాలు పైపుల ద్వారా తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు రూ.35 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు నిర్మాణానికి మండలంలోని గోపాలపట్నం ఆవను ఎంపిక చేశారు. దీనిలో నీటిని నిల్వకు 60 ఎకరాల విస్తీర్ణంలో చెరువు సిద్ధం చేశారు. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం వద్ద నీటిని శుద్ధిచేసే ట్యాంకు, ఏరియేటర్ల నిర్మాణాలు చేపట్టారు. 2017లో అప్పటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్ మరో రూ.51 కోట్లు మంజూరు చేశారు. పనులకు ఆయనే శంకుస్థాపన చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. అధికారులు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.110 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. గత ఏడాది డిసెంబరులో మూడో విడతగా రూ.80 కేటాయించారు. వీటితో గ్రామాల్లో పైపులైను పనులు, ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.


గోపాలపట్నం ఆవలో తాగునీరు

ప్రాజెక్టుకు జాతీయ రహదారి గ్రహణం..: ప్రాజెక్టు పనులు చివరిదశకు చేరుతున్న తరుణంలో జాతీయ రహదారి గ్రహణం పట్టింది. పాయకరావుపేట నుంచి గొడిచెర్ల, నక్కపల్లి మండలంలో ఉద్దండపురం నుంచి అడ్డరోడ్డు వరకు జాతీయ రహదారి పక్క నుంచి పైపులైన్లు వేయాల్సి ఉంది. దీనికోసం పైపులు తీసుకొచ్చారు. తాజాగా ఎన్‌హెచ్ఏఐ అధికారులు కొర్రీలు వేస్తున్నారు. దీంతో పనులు నిలిపివేశారు. వాస్తవానికి పనులకు అభ్యంతరం లేదంటూ 2017లో అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఆరు వరుసల రహదారి విస్తరణ అంశం తెరపైకి తీసుకొచ్చారు. దీంతో పనులు చేపట్టవద్దని హుకుం జారీ చేశారు. ఫలితంగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వందకు పైగా గ్రామాల తాగునీటి కలకు అడ్డంకులు వచ్చాయి.

మంత్రి అనిత దృష్టికి...: జాతీయ రహదారి సమస్యను హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారులతో చర్చించేందుకు ఆమె అంగీకరించారు. ప్రస్తుతం రూ.60 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయి. అడ్డంకులు తొలగితే పనులు మొదలుపెడతాం. **– ఆనంద్, డీఈ, మెగా ప్రాజెక్టు**

చేపల మార్కెట్‌పై నిర్లక్ష్యం నీడ


అనకాపల్లి మార్కెట్‌లో ఇదీ పరిస్థితి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని చేపల మార్కెట్ అభివృద్ధిపై నిర్లక్ష్యం చోటు చేసుకుంటుంది. తెదేపా హయాంలో ఈ మార్కెట్‌లో చేపలను నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీ నిర్మాణానికి రూ. 50 లక్షలను కేటాయించి శంకుస్థాపన చేశారు. తదుపరి అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు మార్కెట్‌లో అభివృద్ధిపై కనీస దృష్టి సారించలేదు. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ఈ మార్కెట్ కొనుగోలుదారులు, వ్యాపారులతో సందడిగా ఉంటుంది. ఆది, మంగళవారం రోజుల్లో కొనుగోలుదారులు అధికంగా వస్తారు. రద్దీకి తగ్గట్టు మార్కెట్‌లో సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనావాసాల మధ్య ఉన్న మార్కెట్‌లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పనులు చేపట్టకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

వ్యాపారుల ఇబ్బందులు

పూడిమడక, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపలను తీసుకొచ్చి అనకాపల్లి మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటారు. తెచ్చిన చేపలు ఎప్పటికప్పుడు అమ్మకాలు జరిగితే సరే. లేకుంటే వీటిని నిల్వ ఉంచడం వ్యాపారులకు పెద్దతలనొప్పిగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీ పనులు చేపట్టడానికి గతంలో ప్రతిపాదనలు చేసి నిధులు మంజూరుచేసినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులా.. చెరువులా?

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: వైకాపా పాలకుల నిర్లక్ష్యం... అధికారుల అలసత్వంతో అయిదేళ్లుగా గ్రామీణ రహదారులకు కనీసం మరమ్మతులు సైతం చేపట్టలేదు. చిన్నపాటి వర్షాలకే రోడ్లపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో బురదలోనే ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి నుంచి గోకులపాడు మీదుగా దార్లపూడి వెళ్లే ప్రధాన రహదారి గోకులపాడులో అధ్వానంగా మారింది. వర్షం వస్తే చాలు నీటిలోనే నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెనుగొల్లు - వమ్మవరం రహదారి దశాబ్దాలుగా అభివృద్ధికి ఎదురు చూస్తుంది. రెండు గ్రామాల్లోనూ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు మొత్తం గోతులు ఏర్పడటంతో వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఆచితూచి రాకపోకలు సాగిస్తున్నారు. పెదఉప్పలం, గెడ్డపాలెం, వేమగిరి రోడ్లు ఇదే పరిస్థితి. కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం గ్రామీణ రహదారుల బాగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గోకులపాడు ప్రధాన రహదారి పరిస్థితి

అ వీ ఇ వీ

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గైనకాలజిస్ట్ జయలక్ష్మి సూచించారు. తిమ్మాపురం కస్తూర్బా విద్యార్థినులకు బుధవారం పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రాజేశ్వరితో కలిసి అవగాహన కల్పించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఉమామహేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరఫరాపై దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు అందించే రేషన్ సరఫరాపై అధికారులు మరింత దృష్టి సారించాలని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ సూచించారు. తహసీల్దారు ఆర్.నరసింహమూర్తిని బుధవారం ఆయన కలిశారు. బియ్యం అక్రమ రవాణాపైనా నిఘా ఉంచాలన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక అయ్యప్పస్వామి ఆలయానికి దొడ్డి ప్రశాంతకి షోర్ సీలింగ్ ఫ్యాన్లు అందించారు. వాటిని బుధవారం షెడ్డులో అమర్చారు. అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటును ప్రారంభించారు. 50 రోజుల పాటు భక్తులకు భిక్ష అందిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

కొత్తూరు (అనకాపల్లి), రాంబిల్లి, న్యూస్‌టుడే: సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏఓ రంగాచారి కోరారు. కూండ్రం, కుంచంగి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది వరి చేలను పరిశీలించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సర్పంచి నందారపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జెట్టి లక్ష్మి, నందారపు సూరిబాబు, జెట్టి అప్పారావు, ఈశ్వరమ్మ, మరిడినాయుడు, రొంగలి సూరిబాబు పాల్గొన్నారు. కుమ్మరాపల్లి, మామిడివాడ గ్రామాల్లో అనకాపల్లి వ్యవసాయ పరిశోధనస్థానం సీనియర్ శాస్త్రవేత్త డా.వి.చంద్రశేఖర్ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరిలో తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు. ఏఓ సి.సుమంత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖాధికారి మనోహర్ తెలిపారు. అపరాధ రుసుం, పన్ను బకాయిలు చెల్లించమని నోటీసులు ఇచ్చినా స్పందించని యజమానుల వాహనాలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

నక్కపల్లి, ఎస్.రాయవరం, మునగపాక, న్యూస్‌టుడే: భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో గురువారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు నక్కపల్లి తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి బుధవారం తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలను రైతులు తెలియజేస్తే వాటిపై విచారణ చేసి పరిష్కరిస్తామని అన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించడానికి గురువారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎస్.రాయవరం తహసీల్దార్ రమేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా
అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:
?: తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే ప్రవేశమార్గం మరమ్మతులకు గురైంది. సమస్యను పరిష్కరించగలరు.
– శేఖర్, తుమ్మపాల
✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రభు, ఆర్‌అండ్‌బీ ఏఈ, అనకాపల్లి

వ్యర్థాలతో అనర్థం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సాగునీటి గలగలలతో నిండుగా ఉండాల్సిన చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలకు నిలయాలుగా మారుతున్నాయి. వీటి కారణంగా సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు వస్తున్నాయి. కేశవరం వద్ద ఉన్న చెరువులో ఇక్కడ ఉన్న వ్యాపార సముదాయాల్లో వచ్చిన చెత్తను వేస్తున్నారు. ప్రస్తుతం చెరువులో నిండుగా నీరు చేరింది. ప్లాస్టిక్ సంచులన్నీ గుట్టలుగా మదుముల వద్దకు చేరుతున్నాయి. దీంతో నీరు పంట కాలువల్లోకి వెళ్లేందుకు వీలుంటడం లేదు. ఒక్కోసారి నీటితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలు పంట భూముల్లోకి చేరుతున్నాయి. దీంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా ఇకనైనా చర్యలు చేపట్టాలి. దీనిపై జలవనరులశాఖ ఏఈ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడతామని చెప్పారు.


కేశవరం వద్ద కాలువలో వ్యర్థాలు

నిర్వాసితులకు న్యాయం చేయాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పరిశ్రమల నిమిత్తం మండలంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని రైతులు, నాయకులు కోరారు. రాజయ్యపేట, బుచ్చిరాజుపేటలో తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి బుధవారం గ్రామసభలు నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరంతా మాట్లాడుతూ కొందరు సాగుదారులకు పరిహారం రాలేదని, నిర్వాసితులెవరికీ ప్యాకేజీలు ఇవ్వలేదని, దీనిపై స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. 18 ఏళ్లు నిండినవారందరికీ రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. నష్టపరిహారం చెల్లింపుల్లో కొందరికి పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్నారు. వీటిని పరిష్కరించాలని కోరారు. ఎం.అప్పలరాజు, కాళ్ల శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

పోషకాహారం తప్పనిసరి

రాంబిల్లి, న్యూస్‌టుడే: మెరుగైన భవిష్యత్తు కోసం పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని దిమిలి వైద్యాధికారి ఆర్.వెంకటేశ్ కోరారు. హరిపురం బీసీటీ-కేవీకేలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మహిళా రైతులు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. ఎంపిక చేసిన మహిళా రైతులకు బహుమతులు పంపిణీ చేశారు. బీసీటీ-కేవీకే ఛైర్మన్ భాగవతుల శ్రీరామ్మూర్తి, శాస్త్రవేత్తలు డా.శైలజకుమ్రా, దివ్యసుధ, విజయరాజ్ఞి, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న శ్రీరామ్మూర్తి

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు


గొడిచెర్లలో శంకుస్థాపనలో నాయకులు

అనకాపల్లి పట్టణం, కశింకోట, రాంబిల్లి, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శంకరం కాలనీ, భట్లపూడి, రాయుడుపేట, పరవాడపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమాదుల పాలెంలలో సీసీ రోడ్లు, కాలువ పనులకు బుధవారం మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు భూమిపూజ చేశారు. కూటమి హయాంలో గ్రామాలను అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు వివరించారు. భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు పొందూరి కోటేశ్వరరావు, దాడిపెంటారావు, పవన్‌కుమార్ గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, కాయల మురళీధర్, పాల్గొన్నారు. రాంబిల్లి మండలంలో నాయకులు దూళి రంగనాయకులు, వి.దిన్నుబాబు, పప్పల నూకన్నదొర శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీఓ ఎన్.జయమాధవి, తెదేపా మండల కార్యదర్శి లాలం తాతబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: వెంకటనగరంలో తెదేపా సర్పంచి వంకా రమణ రహదారి పనులను ప్రారంభించారు. ఎంపీడీవో జయ ప్రకాశరావు, ఏఈ కచేరీ, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ వై. సత్యనారాయణ, సర్పంచులు మేడిశెట్టి రామగోవింద్, గోసల అమ్మాజీ, నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, రోకళ్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు. దేవవరం, గొడిచెర్ల, చీడిక, ముకుందరాజుపేట, దోసలపాడు, రేబాక గ్రామాల్లో ఎంపీడీఓ డి.సీతారామరాజు ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి కొండబాబు, దేవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. లింగాపురం, సుంకపూరు, యండపల్లి గ్రామాల్లో పనులకు తెదేపా మండల అధ్యక్షులు జానకీ శ్రీను శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు, తహసీల్దార్ తిరుమలబాబు, నాయకులు భాస్కరరావు, చంటి, హైమవతి పాల్గొన్నారు.


వెంకటనగరంలో..


శంకరంలో..

ప్రమాదాలు నివారించేలా చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేలా ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. అనకాపల్లి పట్టణంలో రహదారి భద్రతను మెరుగుపర్చడానికి ముఖ్య కూడళ్ల వద్ద స్టాపర్, సైన్ బోర్డులను బుధవారం ఆమె ప్రారంభించారు. అనకాపల్లికి చెందిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్ అందజేసిన ఈ బోర్డులను ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో ప్రజా సహకారం కీలకమన్నారు. రహదారి భద్రతపై కూడా అందరికీ అవగాహన కల్పిస్తామన్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ సీఐ వెంకట రమణ, పట్టణ సీఐ విజయ్‌కుమార్, గ్రామీణ సీఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.



స్టాపర్ బోర్డుల వద్ద ఎస్పీ దీపిక, పోలీసు అధికారులు

స్థలం సమకూర్చితే భవనం నిర్మిస్తా!

మునగపాక, న్యూస్‌టుడే: స్థలం సమకూర్చితే గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తామని సంస్థ జిల్లా కార్యదర్శి సీహెచ్. వెంకటరావు తెలిపారు. గణపర్తి గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పాఠకుల సంఖ్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థల సమస్య కారణంగా భవనం నిర్మించలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుకు పిల్లర్లు వేసి అసంపూర్తిగా విడిచిపెట్టిన స్థలాన్ని అప్పగిస్తే భవనం నిర్మిస్తామన్నారు. గ్రామస్థులు మారిశెట్టి వెంకటరమణ, చదరం లోవరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించండి

కోటవురట్ల, న్యూస్‌టుడే: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా శాంతిభద్రతలపై దృష్టి సారించాలని సీఐ రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. కోటవురట్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్బిబంది పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు ఎటువంటి ఫిర్యాదులొచ్చినా తక్షణమే స్పందించాలన్నారు. ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

రాంబిల్లి, న్యూస్‌టుడే: స్థానిక భవితకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ధనుంజయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో రాయడం, చదవడం, భావాలను వ్యక్తపరచడంలో సమస్యలను ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. అటువంటి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి అభ్యసన లోపాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని వి.వసంత, ఐఈఆర్‌పీలు జె.బుజ్జిబాబు, ఎస్.నాగరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీల్లో సత్తా చూపండి

మునగపాక, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రీడాపోటీల్లోనూ సత్తాచాటాలని మునగపాక జడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు కోరారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారిని, పీఈటీ సన్యాసిరావును బుధవారం తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్రరావుతో కలిసి సత్కరించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, సూర్యచంద్రరావు

పశువుల లారీ పట్టివేత

కంచిలి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కంచిలి వద్ద జాతీయ రహదారి పైవంతెన సమీపంలో బుధవారం పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి చంద్రమణి సమీప ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని ఎస్సై జి.రాజేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కబేళాకు తరలిస్తున్న 32 పశువులతో కూడిన లారీని అడ్డుకున్నామని చెప్పారు. అనకాపల్లికి చెందిన డ్రైవర్ కిల్లి సత్యనారాయణ, పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న చంద్రమణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శూలాల ఉత్సవానికి పందిరి రాట


కార్యక్రమంలో మహిళలు, గ్రామపెద్దలు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సాంబమూర్తి దేవుని శూలాల ఉత్సవానికి బుధవారం పందిరి రాట వేశారు. ఆలయ ప్రాంగణంలో రాటకు పసుపు, కుంకుమతో పలువురు మహిళలు పూజలు చేసి నాటారు. నవంబరు 11న ఉత్సవం నిర్వహిస్తామని కమిటీ ఛైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచి దిమ్మల అప్పారావు, పెంటకోట సత్యనారాయణ, దాడి ముసిలినాయుడు, అలంక సూర్యప్రకాశరావు, మళ్ల సంజీవరావు, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ అక్రమాలపై విచారణకు డిమాండ్

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలపై ఉన్నత స్థాయి సమగ్ర విచారణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాల ఉత్పత్తిదారులకు చెందిన సంపద, ఆస్తులను కొందరు స్వాధీనం చేసుకొని సొంత జాగీరులా మలుచుకున్నారన్నారు. 2016లో రూ. 1100 కోట్లగా ఉన్న టర్నోవర్, 2020కి రూ.. 2 వేల కోట్లకు దాటిందన్నారు. రోజు రోజుకూ వ్యాపారం పెరుగుతుండగా వాటితో పాటు పెరగాల్సిన లాభాలు పెరగకుండా ఎలా అప్పులయ్యాయో తేలాల్సి ఉందన్నారు.

మామిడి సాగుకు రైతులు దూరం

అనకాపల్లి, న్యూస్‌టుడే: రైతులు మామిడి సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒక ఏడాది వస్తే మరుచటి ఏడాది దిగుబడులు రాకపోవడం, కాయ దశకు వచ్చే సమయంలో తరచూ తుపానులు రావడంతో అనుకున్న దిగుబడులు దక్కడంలేదు. దీంతో మామిడికి బదులు నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాలలో ఆయిల్‌పాం, మెట్ట ప్రాంతాల్లో జీడిమామిడి సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. స్థానిక చోడవరం రహదారిలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఉంది. గత ఏడాది 10 వేల మామిడి మొక్కలను సిద్ధం చేసినా కేవలం 4,750 మాత్రమే విక్రయించారు. మిగిలిన మొక్కలు క్షేత్రంలోనే ఉండిపోయాయి. ఒక్కొక్క మొక్కను రూ.45 అమ్మకం చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు నర్సరీల్లో వీటిని రూ. 150 నుంచి రూ. 250 వరకు అమ్మకాలు చేస్తున్నారు.

జిల్లాలో 57,238 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. జీడి మామిడి 27,900 హెక్టార్లలో సాగు చేస్తుండగా, మామిడిని 10,879 హెక్టార్లలో వేస్తున్నారు. కె.కోటపాడు, సబ్బవరం, నక్కపల్లి, మాకవరపాలెం, బుచ్చెయ్యపేట, ఎస్.రాయవరంలో మామిడి తోటలు అధికం. ఇక్కడ కూడా కొంత కాలంగా రైతులు తోటల్లో చెట్లను తొలగిస్తున్నా తిరిగి మామిడి మొక్కలు వేయడం లేదు. వీటి స్థానంలో ఆయిల్‌పాం, జీడిమామిడి వేస్తున్నారని ఉద్యానశాఖ జిల్లా అధికారి జి.ప్రభాకర్ తెలిపారు.


నర్సరీలో మామిడి మొక్కలు

మద్యం దుకాణాల ఏర్పాటుపై ఆందోళన


శారదానగర్‌లో దుకాణం ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు ప్రక్రియ మళ్లీ ప్రారంభం కావడంతో స్థానికులు బుధవారం దుకాణం ముందు ఆందోళన చేపట్టారు. మంగళవారం దుకాణం ఏర్పాటు ప్రక్రియను స్థానికులు అడ్డుకొని నిరసన తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ విజయకుమార్ హామీతో ఆందోళన విరమించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి దుకాణంలో అమ్మకాలు ప్రారంభం కావడంతో స్థానికులు, వార్డు సభ్యులు, శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆందోళనకు దిగారు. జనావాసాల మధ్య దుకాణం ఏర్పాటును తప్పు పట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ దుకాణం నిర్వాహకులతో మాట్లాడారు. వారం రోజుల్లో వేరే చోటుకు మారుస్తామని దుకాణం ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆందోళనకారులు ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడును సంప్రదించగా తాత్కాలిక అనుమతి మాత్రమే ఇచ్చామన్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఏటికొప్పాకలో మద్యం దుకాణం ఏర్పాటుపై రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. రెండు వర్గాలు ఇక్కడే దుకాణాల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. ఒక వర్గం గతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసే స్థలంలో దుకాణం పెట్టుకోగా రెండో వర్గం గ్రామంలో మరో చోట దుకాణం సిద్ధం చేసుకున్నారు. దీన్ని గ్రామంలో పెట్టొద్దంటూ మరో వర్గం అభ్యంతరం తెలిపింది. ఇలా రెండు వర్గాల మధ్య పెద్ద గొడవ జరిగింది. గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎక్సైజ్ సీఐ తేజ, గ్రామీణ ఎస్సై ఉపేంద్ర గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

రోజంతా ఎదురుచూపులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: మందుబాబులు మద్యం కోసం ఎదురు చూపులు చూశారు. లాటరీలో ఎంపికైన విక్రయదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం, సరకు విడిపించుకోవడానికి ఆలస్యమైంది. కోటవురట్ల మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల దగ్గర బుధవారం ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు మద్యంప్రియులు ఎదురు చూశారు. రాత్రి 10 గంటలకు దుకాణానికి సరకు చేరింది. ఆ సమయంలో ఒక్కసారిగా మద్యం ప్రియులు దుకాణం దగ్గరికి చేరి పోటాపోటీగా కొనుగోలు చేశారు.




అమ్మవారిని దర్శించుకుంటున్న తాతయ్యబాబు తదితరులు

వైభవంగా పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చిన్నప్పన్నపాలెం గ్రామంలో పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. నూతనంగా ఆలయాన్ని నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మూడురోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

పల్లె పండగ వాయిదా

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట మండలంలో పల్లెపండగ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. కోమళ్లపూడి, లింగభూపాలపుర అగ్రహారం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, పెదమదిన, చినమదిన, కరక, చింతపాక, సీతయ్యపేట, పెదపూడి, పి.పి.అగ్రహారం గ్రామాల్లో బుధవారం నుంచి పల్లెపండగ వారోత్సవాలు జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని, కొత్తగా షెడ్యూల్ విడుదల చేస్తామని పేర్కొన్నారు.

కుళాయిల నుంచి కలుషిత నీరు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో వీధి కుళాయిల ద్వారా కలుషితమైన తాగునీరు వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తమల్లంపేట, అమ్మపేట, రేఖపల్లి గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలంటూ కొద్దికాలంగా గ్రామస్థులు కోరుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు.

నిధులొచ్చాయి.. పనులే తరువాయి

తాండవ ప్రాజెక్టుకు రూ.1.82 కోట్లు మంజూరు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే


అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని 77 గ్రామాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు కలిగిన తాండవ జలాశయం నుంచి సాగునీరు సాఫీగా సాగిపోయేలా చూడటానికి ప్రభుత్వం రూ. 1.82 కోట్లు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇవిగో నిధులంటూ ఆయకట్టుదారులకు ఆశచూపడం తప్ప పనులేవీ జరగలేదు. తెదేపా ప్రభుత్వం అధికారం చేపట్టిన తరవాత సాగునీటి ప్రాజెక్టులకు అత్యవసరంగా ఏ పనులు చేపట్టాలో శాసన సభాపతి రైతు ప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నారు. వాటికిప్పుడు నిధులు విడుదల చేయించారు.

తాండవ జలాశయం ప్రధాన గేటు అత్యవసరంగా మరమ్మతు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి రూ. 11.40 లక్షలు కేటాయించారు. గేటుకు రంధ్రాలు పడటంతో గతంలో నెలకు 77.76 ఎంసీఎఫ్‌టీల నీరు వృథాగా కాలువలో ప్రవహించేది. ఈ ఖరీఫ్‌కు ముందు ఏఈఈ రామకృష్ణ నిపుణులను పిలిపించి లీకేజీలను తాత్కాలికంగా అరికట్టించారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు కాలువల ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. డిసెంబరు వరకు నీళ్లిస్తారు. ఖరీఫ్ ముగియగానే గేటు మూసేస్తారు. మళ్లీ లీకేజీలు వచ్చే అవకాశం ఉంది. నిధులు సిద్ధంగా ఉన్నందున ఇప్పటినుంచే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటే రైతులకు మేలు జరుగుతుంది.

★ జలాశయ ఎడమ కాలువ 19.80 కిలోమీటర్లు, కుడి కాలువ 15.40 కిలోమీటర్లు పొడవుంది. పలుచోట్ల మదుములు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల లైనింగ్ పాడైంది. నాతవరం మండలం జిల్లేడుపూడి, ఎంబీపట్నం, పాములవాక, చమ్మచింత, గొలుగొండపేట, గాంధీనగరం, కురువాడ, కోటవురట్ల మండలంలో పాములవాకతో ప్రాంతాలతోపాటు కాకినాడ జిల్లాలోని కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో పలుచోట్ల సాగునీటి సరఫరా సజావుగా సాగడం లేదు. ఈ ప్రాంతాల్లో మరమ్మతు పనులకు రూ. 1.70 కోట్ల వరకు ఖర్చుచేయనున్నారు.

★ అవసరమైన నిధులకు ప్రాజెక్టు అధికారులు జులైలో ప్రతిపాదనలు పంపారు. నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. సాంకేతిక ఆమోదం పొందడం, టెండర్లు పిలవడం, గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకోవడం తదితర పనులకు దాదాపు రెండు నెలల సమయం అవసరం. అధికారులు ఇప్పటికిప్పుడు ఈ పనులపై దృష్టిసారిస్తే నవంబరు నాటికి అన్నీ కొలిక్కి వస్తాయి. జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేయగానే గుత్తేదారు పనులు మొదలు పెట్టి గడువులోగా పూర్తి చేయడానికి వీలుంటుంది.




స్పిల్‌వే గేట్లు

గడువులోగా పూర్తి చేయిస్తాం

మరమ్మతు పనులకు నాలుగు రోజుల క్రితమే నిధులొచ్చాయి. సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం సమావేశం నిర్వహించి నిధులు సిద్ధంగా ఉన్నందున తక్షణం పనులపై దృష్టి సారించాలని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా సత్వర చర్యలు చేపడుతున్నాం. 18 చోట్ల మరమ్మతు పనులకు సభాపతి అయ్యన్న ఈ నిధులు విడుదల చేయించారు. జలాశయం ప్రస్తుతం 377.7 అడుగుల నీటిమట్టంతో 3997 ఎంసీఎఫ్‌టీల నీటినిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 359.6 అడుగుల నీటిమట్టంతో కేవలం 1330 ఎంసీఎఫ్‌టీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం కాలువకు 555 ఎంసీఎఫ్‌టీల చొప్పున నీరిస్తున్నాం. ఖరీఫ్ వినియోగం పోను వచ్చే ఏడాదికి గణనీయంగా నీటినిల్వ ఉంటుంది.



– అనూరాధ, తాండవ ప్రాజెక్టు డీఈఈ.

పచ్చదనం.. సమీకృత వసతిగృహం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఎ.కోడూరు సమీకృత వసతిగృహం ఆవరణంతా పచ్చదనంతో నిండి ఉంది. కొబ్బరి, బొప్పాయి, అరటి, సపోటా, ఆకుకూరలు, కాయగూరలు ఇలా చాలా వాటిని వసతి గృహ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి పెంచుతున్నారు. సంక్షేమాధికారి గంగునాయుడు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సేంద్రియ ఎరువులతో ఇక్కడ పండించిన కూరగాయలనే విద్యార్థులకు ఆహారంగా వడ్డిస్తున్నారు. ఇక్కడ పచ్చదనంతోపాటు పరిశుభ్రత పాటిస్తున్నారు.


హరిత శోభతో ఆవరణ


ఇంకుడు గొయ్యి వద్ద మొక్కల పెంపకం

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

రావికమతం, దేవరాపల్లి, న్యూస్‌టుడే: భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 17 నుంచి నవంబరు 6 వరకూ రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రావికమతం తహసీల్దారు వెంకటరమణ చెప్పారు. రావికమతంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. దేవరాపల్లి మండలంలో రీ సర్వే పూర్తయిన 27 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు పి.లక్ష్మీదేవి తెలిపారు. గురువారం తామరబ్బలో గ్రామసభ జరుగుతుందన్నారు.

చోడవరం పట్టణం, చీడికాడ: చీడికాడ మండలంలోని 26 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం చీడిపల్లిలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చోడవరం తహసీల్దారు రామారావు తెలిపారు. తొలిరోజు గురువారం అన్నవరం, వెంకయ్యగారిపేటలో ఉదయం, మధ్యాహ్నం గ్రామ సభలు ఉంటాయన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: విశ్వం, మార్టిన్ ఆడి2: జిగ్రా, శ్వాగ్, మా నాన్న సూపర్ హీరో ఆడి3: దేవర, ఆడి4: వేట్టయన్, జనక అయితే గనక రాజా: వేట్టయన్ బంగార్రాజు: దేవర, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వేట్టయన్ సాయిలక్ష్మి: శ్వాగ్, పూర్ణా: దేవర

అ వీ ఇ వీ

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన రొంగలి శ్రీనివాస్ (32) తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈనెల 13న శ్రీనివాస్ బైకుపై మాకవరపాలెం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన కాలుకు తీవ్రగాయమైంది. మెరుగైన వైద్యం కోసం ఆయనను విశాఖపట్నం తరలించారు. బుధవారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆసుపత్రిలో సదుపాయాల కొరత

చోడవరం పట్టణం: చోడవరం ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బందిపై కలెక్టర్, ఎమ్మెల్యే రాజుకు ఫిర్యాదు చేశామన్నారు. అంబులెన్స్ మూలకు చేరిందని, జనరేటర్, ఎక్స్‌రే ప్లాంట్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

డిస్లెక్సియా బాధితులకు చేయూతనిద్దాం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: డిస్లెక్సియా వ్యాధితో బాధపడే పిల్లలకు తగిన తోడ్పాటునిస్తే మిగిలిన విద్యార్థుల్లాగే అన్ని రంగాల్లో రాణించగలరని గోవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము అన్నారు. గోవాడ, చోడవరం పాఠశాలల్లో బుధవారం ఈ వ్యాధిపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ శరీరంలో వివిధ భాగాల్లో సమన్వయం లోపిస్తే డిస్లెక్సియాగా పేర్కొంటారన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

చీడికాడ, కె.కోటపాడు: గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు అన్నారు. చీడికాడ మండలంలోని వరహాపురం, ఖండివరం, తురువోలు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందులు వేశారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం, గుల్లిపల్లిలో ఏడీ దినేశ్‌కుమార్ పర్యటించి జీవాలకు మందులు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు.

నేడు గాదిరాయిలో పశు వైద్య శిబిరం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: గాదిరాయిలో గురువారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై ఆందోళన

రావికమతం, న్యూస్‌టుడే: కొమిర ఎస్సీ, బీసీ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కొమిరలో జల్‌జీవన్ మిషన్ కింద పాండవుల గుడి దగ్గర నుంచి చాకలి కాలనీ వరకు పైపులైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ కుళాయిలు అమర్చారు. అయితే ఎస్సీ, బీసీ కాలనీలు ఎగువ ప్రాంతంలో ఉండటంతో కుళాయిలకు నీరందడం లేదు. దీంతో వీరంతా గ్రామంలోని మిగతా వీధుల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. సమస్య పరిష్కరించాలని పంచాయతీ, సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక మహిళలు బూరుగు రేణుక, తోకల పేరమ్మ, తోకల లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు ఆధ్వర్యంలో మహిళలు సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

ఆకలి తీర్చే ప్రయత్నం అభినందనీయం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆకలితో అలమటిస్తున్నవారి కడుపు నింపేందుకు సద్భావ టీమ్ ఏర్పాటు చేసిన ఉచిత ఆహార కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే రాజు తెలిపారు. బుధవారం స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడు దేవాలయం వద్ద సద్భావ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ప్రారంభించారు. పుట్టినరోజు, పెళ్లిరోజు, పెద్దల రోజు తదితర కార్యక్రమాల్లో మిగిలిన ఆహారం పెట్టాలనుకునే వారికి ఈ ఫ్రిజ్ ఉపయోగపడుతుందని చెప్పారు. వ్యవస్థాపకుడు కొప్పాక రాజేష్ మాట్లాడుతూ వేడుకలు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా ఈ ఫ్రిజ్ ద్వారా ఆకలితో ఉన్నవారికి అందించవచ్చని తెలిపారు. ఎవరైనా ఆహారం పెట్టవచ్చని.. ఉచితంగా తీసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ పసుమర్తి సాంబ, ధర్మతేజ సత్యనారాయణరెడ్డి, గనిరెడ్డి, వైద్యుడు శకుంతలరావు, అర్చకుడు చలపతి, సద్భావ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు, సభ్యులు

బైలపూడి పాలసంఘం ఎన్నిక వాయిదా

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం బైలపూడి విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇక్కడ పాలసంఘంలో ఇద్దరు డైరెక్టర్లు, ఒక ఛైర్మన్ పదవులను ఎన్నుకునేందుకు బుధవారం ఎన్నిక నిర్వహించారు. ఎనిమిది మంది డైరెక్టర్లు ఉండగా.. నలుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. దీంతో కోరం లేక డెయిరీ అధికారులు ఎన్నికను వాయిదా వేశారు. ఈ సమయంలో కూటమి నాయకులకు, వైకాపా నాయకులకు మధ్య వాగ్వాదం రేగింది. దీంతో కాస్త గందరగోళం నెలకొంది. అక్కడున్న చీడికాడ ఎస్సై సతీశ్ ఇరువర్గాల వారికి నచ్చచెప్పారు. సామరస్యంగా ఎన్నిక జరుపుకోవాలని సూచించారు. గొడవలు పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాలసంఘం వేతన కార్యదర్శి సన్యాసినాయుడు పాల్గొన్నారు.


ఇరు వర్గాలవారికి నచ్చచెబుతున్న ఎస్సై సతీశ్

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

నర్సీపట్నం గ్రామీణం, నాతవరం, గొలుగొండ, కృష్ణదేవిపేట న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రూపొందించిన నిర్మాణాలకు నిధులు విడుదల చేసిందని తెదేపా సీనియర్ నాయకుడు బోళం రామప్రసాద్ అన్నారు. కె.ఎల్.పురం, నగరం, గురందొరపాలెంల్లో సిమెంట్ రోడ్లకు బుధవారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొని స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులన్నీ సత్వరం పూర్తి చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, నాయకులు గెడ్డం వీర్రాజు, రాజమల్లు, రాయి పెదబాబు తదితరులు పాల్గొన్నారు. నాతవరం మండలంలో రూ. 4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెదేపా నాయకుడు కరక సత్యనారాయణ పేర్కొన్నారు. ఎం.బెన్నవరం, గాంధీనగరం, శృంగవరం, ఎ.పి.పురం గ్రామాల్లో రూ. 40 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శ్రీకారం చుట్టారు. మాజీ సర్పంచులు ఉలబాల అప్పలనాయుడు, కొండ్రు అప్పారావు, ఏఈ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. కూటమి సర్కారు చేపట్టిన పనులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెదేపా గొలుగొండ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు అన్నారు. చీడిగుమ్మల, శ్రీరాంపురం, జోగుంపేట గ్రామాల్లో పల్లె పండుగకు హాజరై పలు సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. స్థానిక సర్పంచులు రామకృష్ణ, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు. సీహెచ్.నాగాపురం, అమ్మపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు తారకవేణుగోపాల్ సిమెంట్ రోడ్లు, శ్మశాన వాటికల్లో పనులకు భూమి పూజ చేశారు. సీనియర్ నాయకులు సాంబమూర్తి, బొప్పన ప్రసాదు, కొల్లు రాంబాబు, సుర్ల సీతారామమూర్తి పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలో గురువారం ఉదయం తురువోలు.. తర్వాత చెట్టుపల్లి, పెదగోగాడ, జి.కొత్తపల్లి, చీడికాడ, మంచాల, కోనాం పంచాయతీ గుడివాడ, వాకపల్లి, ఎల్‌బీపట్నం, ఖండివరంలో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హేమసుందర్‌రావు పేర్కొన్నారు.


ఎ.పి.పురం ర్యాలీలో నేతలు, అధికారులు


అమ్మపేటలో భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు


చీడిగుమ్మలలో సీసీ రోడ్ల శంకుస్థాపనలో కూటమి నేతలు

అభివృద్ధి కలను సాకారం చేస్తున్నాం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గడిచిన ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలనే అభివృద్ధిగా చూపి ప్రజలను మోసగించిందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. నర్సీపట్నంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెదేపా అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అభివృద్ధి పనులకు నిధులిచ్చి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు నాణ్యత లేకుండా పనులు చేయించి మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఆర్‌అండ్‌బీ అనుమతి లేకుండానే బూడిద కలిపి నర్సీపట్నంలో రోడ్డు, డివైడర్ పనులు చేపట్టారని పేర్కొన్నారు. నాతవరానికి జూనియర్ కళాశాల తెచ్చినట్టు దొంగ జీఓ చూపించారని ఆరోపించారు. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు తొలి వంద రోజుల్లోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ. 17.05 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. రూ. 14.36 కోట్లు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, రూ. 1.32 కోట్లు తాండవ జలాశయ కాలువల మరమ్మతులకు, కృష్ణదేవిపేట మార్గంలో కల్వర్టు నిర్మాణానికి రూ. 43 లక్షలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రూ.96 లక్షలు ఖర్చు చేయనున్నారని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో ఇసుక అక్రమాలకు పాల్పడిన ప్రతిమ సంస్థకు నర్సీపట్నం గనులశాఖ అధికారులు రూ. 18.7 కోట్లు జరిమానా విధించారని తెలిపారు.


మంజూరైన నిధుల వివరాలు వెల్లడిస్తున్న విజయ్

ఇసుక ఉచితంగా ఇవ్వాలి: గణేష్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రజలకు ఉచిత ఇసుక ఇచ్చేలా ఒత్తిడి తెద్దామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. నర్సీపట్నంలో బుధవారం జరిగిన నియోజకవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో ఉచిత ఇసుక ఇప్పటికీ లభ్యం కావడం లేదన్నారు. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ దాదాపు ఐదువేల కుటుంబాల ఉపాధి దెబ్బతిందని పేర్కొన్నారు. గబ్బాడ ఇసుక యార్డులో దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని, దాన్ని ఉచితంగానే పంపిణీ చేయాలని కోరుతూ ఈనెల 21న నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రుత్తల యర్రాపాత్రుడు, లక్ష్మీకాంత్, ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: మురుగుపాలెం వద్ద కాజ్‌వే కుంగింది. కొత్తది నిర్మించరూ.. – రాజు, పైడమ్మపేట

✓: రాకపోకలకు ఇబ్బంది లేదు. – బాలాజీ అప్పారావు, ఏఈ, కె.కోటపాడు.

?: దండుముత్యాలమ్మతల్లి గుడికి చేరే దారిలో మదుం నిర్మించి సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేయండి. – దేముడు, చౌడువాడ.

✓: పరిశీలించి ప్రతిపాదనలు పంపుతాం. – బాలాజీ అప్పారావు, ఏఈ, కె.కోటపాడు.

పల్లకిలో పెళ్లికూతురు

పూర్వం పెళ్లి కూతుర్ని పల్లకిలో ఊరేగించేవారు. అదొక ఆనవాయితీగా కొనసాగేది. కాలంతోపాటు సంప్రదాయాలు చాలా మారిపోయాయి. ఈనాటికీ కొంతమంది అప్పటి జ్ఞాపకాలను మరోసారి గుర్తుకు తెస్తున్నారు. దేవరాపల్లిలో బుధవారం జరిగిన ఓ పెళ్లి వేడుకలో వధువును విజయనగరం నుంచి తీసుకొచ్చిన పల్లకీలో ఊరంతా ఊరేగించి పెళ్లి పందిట్లోకి తీసుకెళ్లారు.

– దేవరాపల్లి, న్యూస్‌టుడే



అందరి తోడ్పాటుతోనే సహకార సంఘ అభివృద్ధి

చీడికాడ, న్యూస్‌టుడే: సహకార సంఘం అభివృద్ధికి సభ్య రైతులందరూ తోడ్పాటు ఇవ్వాలని చోడవరం సబ్ డివిజన్ ఆడిటర్ రమారత్నం అన్నారు. చీడికాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ బుధవారం రామాలయం ఆవరణలో నిర్వహించారు. గత మహాజన సభలో చర్చించిన అంశాలను చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం అంచనా ఆదాయం, వ్యయం, వాస్తవిక ఖర్చులను ఆమోదించారు. ఈ సందర్భంగా రమారత్నం మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలో 7,278 మంది సభ్య రైతులు ఉన్నారని, వారిలో 1,380 మంది ఈ-కేవైసీ నమోదు చేయించుకున్నారని, మిగిలినవారు త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.వరహాలదొర, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు చదువుతున్న చోడవరం సబ్ డివిజన్ ఆడిటర్ రమరత్నం

సకాలంలో తెగుళ్ల నివారణ చర్యలతో ప్రయోజనం

రావికమతం, న్యూస్‌టుడే: వరి పంటపై ఆశించిన తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.రూప రైతులకు సూచించారు. కానాడ, దిడ్డి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో ఎరువుల వాడకం, ఎరువుల మోతాదు, పురుగు తెగులు నివారణ చర్యలు వివరించారు. వరి పైరులో పొటాష్ లోపం ఉన్నట్టు గమనించి లోప నివారణకు మల్ఫీ-కె 5 నుంచి 10 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

చీడికాడ, న్యూస్‌టుడే: వరిలో వ్యాపిస్తున్న సుడిదోమ, ఆకుముడత తెగుళ్ల లక్షణాలను రైతులు ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కొండెంపూడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాబు సూచించారు. చీడికాడ మండలం చెట్టుపల్లి, వెల్లంకి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమాదేవి, సిబ్బంది రంగనాథ్ పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, న్యూస్‌టుడే: రైతులు వరిలో అధికంగా నత్రజని వాడటం వల్ల చీడపీడలు ఆశించే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి వాసుదేవరావు అన్నారు. జాలంపల్లి, లోవ పొన్నవోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో పాముపొడ తెగులు, పచ్చపురుగు ఆశించి ఉన్నాయన్నారు. రైతులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని, వారి సూచనల మేరకు మందులు వాడాలన్నారు. మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారిణి భాను పుష్ప లీలావతి తదితరులు పాల్గొన్నారు. కె.కోటపాడు, గుల్లిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏఓ సోమశేఖర్, సర్పంచులు యర్రంశెట్టి భవాని, బండారు దేముళ్లు, పైల అప్పాజీ పాల్గొన్నారు.


కె.కోటపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ, సర్పంచులు


చెట్టుపల్లిలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త బాబు, ఏఓ రమాదేవి

అధిక ధరలకు విక్రయంపై ఆందోళన

మాకవరపాలెం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండ్, బుచ్చెయ్యపేటలో బుధవారం ప్రారంభించిన మద్యం దుకాణం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం సరకు వస్తోందని తెలుసుకున్న మందుబాబులు వందల సంఖ్యలో మాకవపాలెం దుకాణం వద్ద ఉదయం నుంచే పడిగాపులు కాశారు. స్టాక్ వచ్చిన అనంతరం దుకాణదారులు అమ్మకాలు ప్రారంభించారు. రూ. 170 ధర ఉన్న సీసా రూ. 230కు అమ్ముతుండటంతో మందుబాబులు ఆందోళనకు దిగారు. గొడవ పెరిగిపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి దుకాణాన్ని మూయించారు. బుచ్చెయ్యపేటలో క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ. 20లు తీసుకుని విక్రయాలు చేశారు. అధిక ధరలు వసూలు చెయ్యడంపై సిబ్బందితో మందుబాబులు వాగ్వాదానికి దిగారు. దుకాణం వద్ద చుట్టూ పెద్దఎత్తున జనాలు గుమిగూడారు. దాంతో దుకాణ సిబ్బంది కాసేపు షట్టర్లు మూసేసి కొంతసేపటి తర్వాత తెరిచారు.

గుడి, బడి దగ్గరలో మద్యం దుకాణాలొద్దు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కొత్తగా మంజూరైన మద్యం దుకాణాలు ఆలయాలు, విద్యాలయాలకు దూరంగా ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ ఓ ప్రకటనలో కోరారు. ఈ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు వల్ల పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే పరిస్థితులు తలెత్తే ప్రమాదముందన్నారు.

అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకరించండి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు వార్డు సభ్యులు తమవంతు సహకారం అందించాలని ఎంపీడీఓ కె.జయశ్రీ కోరారు. వార్డు సభ్యులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన సమాజం, నాణ్యమైన విద్య సాధనకు సూచనలిస్తుండాలని కోరారు. ప్రజలు గ్రామసభలకు స్వచ్ఛందంగా హాజరై అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఇంటిలో తడి-పొడి చెత్త వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసేలా చైతన్యం కలిగించాలని కోరారు. జిల్లా సమన్వయ కర్త ఎస్‌కేపీ సాహిద్, పరిపాలనాధికారి బి.రమణబాబు పాల్గొన్నారు.


సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ఉషశ్రీ

ఏడేళ్ల తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం నామపత్రాలు దాఖలయ్యాయి. రెండు ప్యానళ్ల తరఫున 19 మంది నామపత్రాలు అందజేశారని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరు చొప్పున నామపత్రాలు అందజేశారు. వాటిని ఈనెల 17న పరిశీలించనున్నారు. 18వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు సమయం ఉంది. ఈనెల 23న ఎన్నిక నిర్వహించనున్నారు. టి.గంగాభవాని అధ్యక్షురాలిగా ఒక ప్యానెల్, వి.ఉషారాణి అధ్యక్షురాలిగా ఒక ప్యానెల్ నామపత్రాలు దాఖలు చేశారు. దాదాపు 7ఏళ్ల విరామం తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు జరుగుతుండటంతో కేజీహెచ్‌లో కోలాహలం నెలకొంది.

పెందుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

సమస్య: సాయినగర్‌కాలనీ సుజల్ శోరూం ఎదుట సుమారు నెల రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. – బి.వెంకటరమణ, సబ్బవరం

సమాధానం: క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

■ రాత్రుళ్లు కనిపించని వేగనిరోధకాలు
■ అదుపుతప్పి గాయపడుతున్న వాహనచోదకులు

బీఆర్టీఎస్‌లో అడుగుకో గండం..!


నాయుడుతోట వద్ద రేడియం స్టిక్కర్లు లేని వేగనిరోధకం

వేపగుంట, న్యూస్‌టుడే

బీఆర్టీఎస్ రహదారిలో అడుగుకో గండం దర్శనమిస్తోంది. గతంలో మధ్యమార్గంలో ప్రమాదాలు జరిగి పలువురు పాదచారులు మృతి చెందడంతో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల సర్వీస్ రహదార్లలోనూ వీటిని ఏర్పాటు చేశారు. ఇది మంచిదే అయినా రాత్రుళ్లు అవి స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు అమర్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాళ్లు, చేతులు విరిగి పలువురు ఆసుపత్రులపాలైన సందర్భాలు ఉన్నాయి.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు

■ ఎస్ఆర్ పురానికి చెందిన శ్రీరంగం సాయినాథ్ (24) స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రెండురోజుల కిందట ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరారు. బాలాజీగార్డెన్-ఆర్ఆర్ వెంకటాపురం మార్గంలో బీఆర్టీఎస్ రహదారి దాటి నరవ మీదుగా స్టీల్‌ప్లాంట్‌కు వెళుతున్నారు. ఆర్ఆర్ వెంకటాపురం వద్ద వేగనిరోధకం కనిపించకపోవడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. చేయి విరిగిపోయి ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

■ వేపగుంట బీసీకాలనీకి చెందిన కె.శివ ఆటో నడుపుతుంటాడు. సర్వీసు రహదారిపై వేగనిరోధకం వేసినట్లు గుర్తించకపోవడంతో వేపగుంట వినాయకుని ఆలయం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శివకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని శివ వాపోతున్నాడు. ఇలా వేగనిరోధకాల వద్ద తరచూ ద్విచక్రవాహనదారులు పడిపోయి గాయపడుతున్నారని బీఆర్టీఎస్ రహదారి పక్కనున్న దుకాణదారులు చెబుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకరం

● వేపగుంట కూడలి ● నాయుడుతోట
● ఆర్ఆర్ వెంకటాపురం ● ప్రహ్లాదపురం
పాతగోశాల కూడలి ● చినముషిడివాడ కూడలి
● పెందుర్తి ఆంజనేయస్వామి గుడివద్ద..


వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద..

ప్రమాణాలు పాటించరా..

బీఆర్టీఎస్‌లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఇక్కడ అడుగుకో వేగనిరోధకం ఉండడం సమస్యగా మారింది. ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక ప్రాంతంలో వేగనిరోధకం ఏర్పాటు చేయాలంటే తగిన ప్రమాణాలు పాటించాలి. వాహనచోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటి ఎత్తు ఉండాలి. అలాగే రేడియం స్టిక్కర్లు అమర్చాలి. కాని బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్లలో ఎక్కడా ఈ ప్రమాణాలు పాటించినట్లు కనిపించడం లేదు. శిరస్త్రాణం(హెల్మెట్) ధరించ లేదని కేసులు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వేగనిరోధకాల విషయంలో ప్రమాణాలు పాటించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రాత్రుళ్లు వేగనిరోధకాలు స్పష్టంగా కనిపించేలా తెల్లరంగు లేదా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కోటపాడు-పినగాడి మార్గంలో నిత్యం అవస్థలే..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా పినగాడి నుంచి కె.కోటపాడు వెళ్లే మార్గంలో సుమారు 30గ్రామాల ప్రజలతో పాటు వందలాది ఆటోలు, 50కిపైగా బస్సులు నిత్యం రాకపోకలు చేస్తుంటాయి. ఈ మార్గం ఆధారంగా నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యమున్న ఈ రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఈ గుంతల్లో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మొగలిపురం బందమ్మ గుడి సమీపంలో..

కార్మిక సదస్సు విజయవంతానికి పిలుపు

పెందుర్తి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18న విజయవాడలో తలపెట్టిన రాష్ట్ర కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.మల్లయ్య పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన ప్రచార గోడపత్రికను బుధవారం చినముషిడివాడ దరి అంబేడ్కర్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇబ్బందికరంగా మారిన నాలుగు లేబర్ చట్టాలు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, సభ్యులు సీహెచ్.వెంకటరావు, చిన్నారి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సు ప్రచార గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

అ వీ ఇ వీ

■ **నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు**

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు(గ్రామ సభలు) నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. ఈనెల 17వ తేదీన తానాం, 19 కలపాక, 22 పరవాడ, 24 కన్నూరు, 26 వెంటసీమభోనంగి, పాయకరావు భోనంగి, 29 భరణికం, నవంబరు 1వ తేదీన ఈదులపాక భోనంగి, 2 ఈ.మర్రిపాలెం, 5వ తేదీన పెదముషిడివాడ గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. ఇవి ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, సామాజిక భవనాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. రెవెన్యూ శాఖ పరంగా ఎలాంటి సమస్యలున్నా ఈ సభల్లో వినతులు ఇవ్వొచ్చునన్నారు. రీసర్వే భూముల కొలతలు, హద్దుల్లో తేడాలున్నా పేర్లు తప్పుగా పడినా అర్జీలు పెట్టుకోవాలన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

రేపు సబ్బవరం మండలంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సబ్బవరం మండలంలో వివిధ కార్యక్రమాలు జరగనున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 8-30 గంటల నుంచి వరుసగా తవ్వవానిపాలెం, అమృతపురం, పెద గొల్లలపాలెం, బాటజంగాలపాలెం, అసకపల్లి, సబ్బవరం-1, 2, 4 సచివాలయాలు, ఎల్లుప్పి, బోదువలస, గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని ఆ వర్గాలు వెల్లడించాయి.

■ **4 కిలోల గంజాయి స్వాధీనం**

పెందుర్తి, న్యూస్‌టుడే: అరకు నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం సరిపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ ప్రాంతానికి చెందిన రాంబాబు అలగు (32), కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఇమ్మాన్యుయేల్ దాకవరపు (28)ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై గతంలో టూ టౌన్, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు.

■ **'పంప్‌డ్ స్టోరేజీ'లతో నీటి వనరులు కనుమరుగు**

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తూర్పు కనుమల్లో ఏపీ ప్రభుత్వం మంజూరు చేసిన పంప్‌డ్ స్టోరేజ్ స్కీమ్‌లను రద్దు చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుమంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనానందన్‌కు బుధవారం లేఖ రాశారు. ఈ ప్రాజెక్టుల వల్ల స్థానికంగా అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు కనుమరుగువుతాయన్నారు. గత ఏపీ ప్రభుత్వం స్థానిక గిరిజన గ్రామసభలను సంప్రదించకుండా రెండు ముఖ్యమైన కేంద్ర చట్టాలను ఉల్లంఘించిందని ఆయన కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

జనావాసాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం: ఎమ్మెల్యే


తానాంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, చిత్రంలో కూటమి నాయకులు, అధికారులు

పరవాడ, న్యూస్‌టుడే: జనావాసాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి వాటిని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లెవానిపాలెం, పి.భోనంగి గ్రామాల్లో సీసీ రోడ్లు, కాల్వలు తదితర అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవీఎంసీ, జడ్పీ తదితర నిధులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పలుచోట్ల ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ అంబేడ్కర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహంలో సదుపాయాలపై ఆరా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ తనిఖీ చేశారు. వసతి గృహంలో సదుపాయాలపై బాలలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందించే భోజనం, ఆహార పదార్థాలు, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. వార్డెన్ సూర్యప్రకాశరావు నుంచి వివరాలు సేకరించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.


వార్డెన్‌తో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

ముగిసిన వార్డు సభ్యులు, ఉపసర్పంచుల శిక్షణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో రెండు రోజుల గ్రామ వార్డు సభ్యులు, ఉపసర్పంచుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ 24 పంచాయతీల్లో ఇద్దరేసి వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు రెండు రోజుల శిక్షణ విజయవంతంగా నిర్వహించామన్నారు. పంచాయతీల్లోని వీధిలైట్లు, పారిశుద్ధ్యం, తదితర అన్ని విషయాలపైనా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల్లో మంచినీటి యాజమాన్య పద్ధతులు నీటిని శుభ్రపరిచే విధానంపై వివరించారు. ఈవోపీఆర్‌డీ చైతన్య చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేపగుంట, న్యూస్‌టుడే: 11కేవీ ఎల్‌బీనగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పురుషోత్తపురం, గోకుల్‌ధామ్ కాలనీ, పురుషోత్తపురం కాలనీ, ఎన్ఏడీ లేఅవుట్, ఎల్‌బీనగర్, శానాతివానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు.

630 కిలోల రేషను బియ్యం పట్టివేత

పెందుర్తి, న్యూస్‌టుడే: అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. చినముషిడివాడ ప్రాంతంలోని ఓ నివాసంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 630 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని డీసీఎస్ఓ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.


పట్టుబడ్డ రేషను బియ్యంతో డీసీఎస్ఓ భాస్కర్‌రావు


నిరసన తెలుపుతున్న సిటూ నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ వీసెజ్‌లోని సినర్జీస్ కాస్టింగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని సిటూ నాయకుడు ఎం.రాంబాబు ఆరోపించారు. వేతనాలపై ప్రశ్నించిన కార్మికుల్ని విధుల నుంచి తొలగిస్తామని యాజమాన్యం బెదిరిస్తోందన్నారు. బుధవారం సంస్థ గేటు వద్ద సిటూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో పని చేస్తున్న సుమారు 950 మంది కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్నం బి-షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు పరిశ్రమ గేటు వద్ద ఆందోళనకు దిగడంతో ఏ-షిఫ్ట్‌కు వచ్చిన వారంతా సంస్థ లోపలే ఉండిపోయారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే రాత్రంతా ధర్నా కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. సిటూ నాయకులు దత్తాత్రేయ, నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవీపురంలో దసరా ముగింపు వేడుకలు


శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు


సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురంలో ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన దసరా బ్రహ్మోత్సవాలు 17వ తేదీతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా గురువారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు కె.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో లలితా సహస్రనామావళి పఠనం, ఆ తర్వాత ఉదయం 10 గంటలకు కల్యాణ వేడుకలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, సాయంత్రం జల హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అక్కడ టపాసుల దుకాణాల ఏర్పాటులో తప్పేముంది: హైకోర్టు

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) మైదానంలో దీపావళికి టపాసులను విక్రయించేందుకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వకుండా అధికారులను నిలువరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు స్పష్టంచేసింది. విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది.

★ ఏయూ పరిధిలోని 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న 1500 చెట్లను కూల్చివేశారని, అందుకు అటవీశాఖ అధికారుల అనుమతి లేదని, వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొట్టేశారని, కుంటలు, నీటి ప్రవాహ ప్రాంతాలను(గెడ్డలను) పూడ్చి వేస్తున్నారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ 2022లో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తాజాగా అనుబంధ పిటిషన్ వేస్తూ.. దీపావళికి టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఏయూ మైదానంలో భూమిని చదును చేస్తున్నారన్నారు. మైదానానికి సమీపంలో విద్యార్థుల వసతిగృహం ఉందన్నారు. ఏయూ, జిల్లా కలెక్టర్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 15 ఏళ్లుగా ఆ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జనావాసాలకు దూరంగా అదే సురక్షిత ప్రాంతమన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం దుకాణాల ఏర్పాటును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. అనుబంధ పిటిషన్ నిరర్థకం అయ్యేందుకు ఉద్దేశపూర్వకంగానే విచారణను నవంబర్ 1కి వాయిదా వేస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

వ్యక్తి అదృశ్యంపై చురుగ్గా దర్యాప్తు


దాడి ప్రసాదరావు (పాతచిత్రం)

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రాతిచెరువు దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన దాడి ప్రసాదరావు (54) అదృశ్యంపై పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. ప్రసాదరావు ఛత్తీస్‌గఢ్‌లోని ఉక్కు పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 9న సెలవుపై పెందుర్తికి వచ్చారు. 12న మధ్యాహ్నం సినిమా చూడడానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. చరవాణి కూడా పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆ మేరకు ప్రసాదరావు భార్య హేమలత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజుకు అప్పగించారు. ప్రసాదరావు ఆచూకీ కోసం చురుగ్గా దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రాజు తెలిపారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దివాకర్‌రావు తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అభ్యసన వైకల్య మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి దివాకర్‌రావు మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాలున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్నిరకాల సేవలు, సదుపాయాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణ వల్ల వారిలో ఉన్న అభ్యసన సమస్యలు అధిగమించవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సిబ్బంది కుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సింధియా: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు... బిహార్‌లోని పాట్నాకు చెందిన విక్కీకుమార్ విశాఖపట్నం నౌకాదళంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఝార్ఖండ్‌కు చెందిన కుసుమకుమారి(28)తో 2020లో వివాహమైంది. వారు స్థానిక బర్మాకాలనీలో నివాసం ఉంటున్నారు. ఉదయం విక్కీకుమార్ విధులకు వెళ్లగా, 10.30 గంటల సమయంలో కుసుమకుమారి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు, నేవీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ పర్యవేక్షణలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

యూజీడీ మురుగు రోడ్డుపైకి..


నాగమల్లినగర్ దరి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఇలా..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే

జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ కాలనీ డీఏవీ పాఠశాల వెనుక ప్రాంతంలో మురుగు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ నాగమల్లినగర్ దరి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద యూజీడీ (భూగర్భ మురుగు నీటి వ్యవస్థ) మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. గత కొన్నాళ్లుగా రోడ్డుపైకి మురుగు ప్రవహించి నిలిచిపోయింది. మట్టి రోడ్డు కావడంతో బురదగా మారి ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయని, పాదచారులు పడిపోతున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు.

రహదారి కుంగిపోతోంది..



జీవీఎంసీ 93వ వార్డు దుర్గానగర్‌కాలనీకి వెళ్లే రహదారిపై గొయ్యి ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. రాత్రివేళల్లో కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. గొయ్యి కింది భాగాన కాలువ ఉండటంతో రోజురోజుకు రోడ్డు కుంగిపోతోంది. పెద్ద ప్రమాదం జరగక ముందే జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– వేపగుంట, న్యూస్‌టుడే

కాలువలో పిచ్చిమొక్కలు.. కదలని మురుగు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే

జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సత్యానగర్ దరి నాగేంద్రకాలనీలోని కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి మురుగు నిలిచిపోయింది. చాన్నాళ్లుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఇరువైపులా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయి మురుగు కదలని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని కోరారు.


నాగేంద్రకాలనీలో కాలువలో పిచ్చి మొక్కలు